క్లుప్తంగా

ఘనంగా అన్నసమారాధన



అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం : శ్రీ వరసిద్ధి వినాయక పూజా మహోత్సవం సందర్భంగా జీవీఎంసీ 51వ వార్డులో అన్న సమారాధన నిర్వహించారు. ఈ మేరకు గాంధీనగర్ – 2 ఏరియాలో శ్రీ వివేకానంద సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అన్నసమారాధనను కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ప్రారంభించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న మినీ వ్యాన్



పడిపోయిన విద్యుత్ స్తంభం

మద్రిపాలెం : కంచరపాలెం మెట్టు నుంచి జ్ఞానాపురం కాన్వెంట్ జంక్షన్ వైపుగా వెళ్తున్న మినీ వ్యాన్ ఒకటి అదుపుతప్పి ఆదివారం ఉదయం కంచరపాలెం వంతెనపై ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. అయితే ప్రమాద సమయంలో ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఘటనా స్థలానికి కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరథి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా క్రమబద్ధీకరించారు.

ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సాయం



అనారోగ్యంతో బాధపడుతున్న ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సాయం చేస్తున్న గోవింద్

సీతమ్మధార : కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆటో డ్రైవర్ గణపతి రెడ్డి కుటుంబానికి ఏఐటీయూసీ ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ చేతుల మీదగా ఆర్థిక సాయం చేశారు. సీతమ్మధారలోని శిరిడి సాయి ఆటో స్టాండ్‌లో ఆటో నడుపుతున్న గణపతి రెడ్డికి షుగర్ ఎక్కువ కావడంతో ఒక కన్ను తీసేశారు. మరో కన్ను కనిపించకపోవడంతో ఆర్థిక సాయం అందించినట్లు గోవింద్ తెలిపారు. అవసరమైన నిత్యావసర సరకులు అందించారు. కార్యక్రమంలో లంక గోవింద్, అప్పలనాయుడు, ఎ.శ్రీను, నాయుడు, సోములు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం



సీఐ వెంకటరమణ

సీతమ్మధార : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని ద్వారకా పోలీస్ స్టేషన్ సీఐ డి.వెంకటరమణ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన ద్వారకా స్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టాక మీడియాతో మాట్లాడారు. మాదక ద్రవ్యాలు సరఫరా, గంజాయి అక్రమ రవాణాదారులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. రౌడీషటర్లు హద్దు మీరితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఆడపిల్లలను ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆకతాయిలపై ప్రత్యేక నిఘా ఉంటుందని, కళాశాలల వద్ద సాయంత్రం బ్లూకోట్స్ పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పని చేస్తామన్నారు. ఎస్ఐ శ్రీనుతోపాటు ఏఎస్ఐలు, హెచ్‌సీలు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. ప్రస్తుత సీఐ డి.వెంకటరమణకు ఇక్కడ విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన సీఐ ఎస్.రమేష్ స్వాగతం పలికి మొక్క అందించారు. అనంతరం రమేష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఐ, శ్రీను, ఏఎస్ఐ డి.వి.రత్నం, గంగాధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భిన్నరూపాల్లో కొలువైన గణనాథుడు

- వైభవంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు



దుర్గా గణపతికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతంపేట : నియోజకవర్గంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శనివారం చవితి సందర్భంగా విభిన్న రూపాల్లో గణనాథుని ప్రతిమలు తీసుకొచ్చి మండపాల్లో ప్రతిష్ఠించారు. మరోవైపు గణపతి ఆలయాల్లో ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక సీతంపేట కూడలిలో గల దుర్గా గణపతి ఆలయంలో వినాయక నవరాత్రి మహోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వినాయక చవితి రోజున దుర్గాగణపతి నిజరూపంలో వెండి తొడుగు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ఈవో జి.వి.రమాభాయి, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, ప్రధాన అర్చకులు నటరాజన్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఉదయం 5 గంటల నుంచి విశేష గణపతి హోమం, మహా అభిషేకం, సహస్ర నామార్చన జరిపించారు. స్వామి దర్శనానికి ఉదయం నుంచే క్యూలైన్‌లో భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

చందన గణపతి అలంకారంలో...

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు



సత్యం జంక్షన్ గాంధీనగర్‌లో గణపతి విగ్రహం వద్ద భక్తులు



చందన గణపతిగా దర్శనమిచ్చిన దుర్గా గణపతి

ఆదివారం 'చందన గణపతి' అలంకరణలో దుర్గా గణపతి భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర ప్రాంత భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. సోమవారం 'త్రిముఖ గణపతి' అలంకరణలో దుర్గా గణపతి భక్తులకు దర్శనమిస్తారని నిర్వాహకులు తెలిపారు.

తాటిచెట్లపాలెం : లక్ష్మీనారాయణపురం కాలనీ, సంతోషిమాత కాలనీల్లో వినాయక చవితి పూజల్లో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, పార్టీ నాయకులు హరి పట్నాయక్, నేపాల్ శ్రీను, సన్నీ, ముప్పిడి రామారావు పాల్గొన్నారు. కమిటీ మెంబర్లు పైడి శ్రీను, అద్దంకి జగదీష్, బి.రమణ, డి.గణేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

- పోర్టు హాస్పిటల్ ఎదురుగా గల లక్ష్మీ వినాయక ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీ సాయి కళానికేతన్ వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ ఎంవీ రాజశేఖర్, పి.వేణుగోపాల్, డీవీ వర్మ, రమణమూర్తి, శ్రీగురుపాద సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

కంచరపాలెం : జీవీఎంసీ 54వ వార్డు ఊర్వశి కూడలి రవీంద్రనగర్‌లో షణ్ముఖ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, జిల్లా యువజన విభాగం మాజీ అధ్యక్షుడు కర్రి రామారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. జీవీఎంసీ 46వ వార్డు లక్ష్మీనారాయణపురం – 1లో నిజం అసోసియేషన్ అధ్వర్యంలో సోమవారం గణేష మహోత్సవ కార్యక్రమంలో నేషనల్ పోర్టు యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు దంపతులు గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వి.శ్రీనివాస్, ఎస్.అప్పారావు, కె.రమణ, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బాలభాను పాఠశాలలో విజయగణపతికి పూజలు చేస్తున్న భక్తులు



లక్ష్మీనారాయణపురంలో వేడుకల్లో పైడి రమణ, తదితరులు

మద్రిపాలెం : వినాయక చవితి సందర్భంగా జీవీఎంసీ 51వ వార్డు అంబేడ్కర్ కాలనీలో జై భీమ్ అసోసియేషన్, లంబోదర యూత్ కమిటీ, కళింగ నగర్ వుడా క్వార్టర్స్ వినాయక వెల్ఫేర్ అసోసియేషన్, స్వామి వివేకానంద సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని మండపాలను కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ సందర్శించి స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 53వ వార్డు మద్రిపాలెం శ్రీ హర్షనగర్‌లో కాలనీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా గణనాథుని 11 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

సీతమ్మధార : జీవీఎంసీ 14, 24వ వార్డు బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గరుడ వాహనంపై నటరాజ్ నృత్యం చేస్తున్నట్లు భక్తులకు గణపతి దర్శనమిచ్చారు. పరశురాంరాజు దంపతులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పరశురాంరాజు, ధర్మారావు, భరత్ కుమార్, కమిటీ సభ్యులు అజయ్, నాయుడు, నాగరాజు పాల్గొన్నారు. 14 వార్డు గణేష్‌నగర్‌లో శ్రీ త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయం ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించారు. కళా ఆస్పత్రి అధినేత పి.వి.రమణమూర్తి దర్శించుకున్నారు. ఇక్కడ 11 రోజులపాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని కమిటీ అధ్యక్షుడు



వానప్రస్థ వృద్ధాశ్రమంలో పూజలు అందుకుంటున్న వినాయకుడు



లక్ష్మీనారాయణపురంలో గణపతి మండపంలో భక్తులు



బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో పూజలందుకుంటున్న గణపతి

టి.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. ఆక్సిజన్ టవర్స్‌లో వినాయక చవితి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

సీతమ్మధార : స్థానిక 24వ వార్డు సత్యం జంక్షన్ దరి గాంధీనగర్‌లో శ్రీ లక్ష్మీ గణపతి యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో శ్రీ వరసిద్ధి వినాయక పూజా మహోత్సవాల్లో భాగంగా అయోధ్య ఆలయ నమూనా మండపం భక్తులను ఆకట్టుకుంది. వినాయక విగ్రహ దాత, వైఎస్సార్‌సీపీ నాయకుడు, సింహాచలం ట్రస్ట్ బోర్డు మాజీ మెంబర్ సంపంగి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేశారు. కోన గోవిందరావు మాట్లాడుతూ 18న భారీ అన్నసంతర్పణ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కోన ఆనంద్, ఆర్.సాయికృష్ణ, సాగర్ పాల్గొన్నారు.

మురళీనగర్ : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పట్టాభిరెడ్డితోట, సత్యానగర్, సూర్యానగర్, అయ్యప్పనగర్, ఎన్‌జీజీవోస్ కాలనీ, మురళీనగర్ సెక్టార్లలో మండపాలు ఏర్పాటు చేసి వినాయకుడి ప్రతిమలు ఏర్పాటు చేశారు. భక్తులు పాల్గొని వినాయకుడికి పూజలు చేశారు. మురళీనగర్ సెక్టార్ – 8లోని బాలభాను పాఠశాలలో విజయ గణపతికి 220 కొబ్బరికాయలతో అభిషేకం చేశారు. నమకం, చమకం, కొబ్బరి నీళ్లు, పంచామృతాలు, గంధం, విబూదితో అభిషేకించారు. ఎస్‌పీఏ నారాయణ రావు, బాలభాను పూర్వ విద్యార్థి కృష్ణ, సీహెచ్ సూర్యనారాయణ దంపతులు, సీహెచ్ రమణా రావు దంపతులు పూజలు చేశారు. పూజల్లో భాగంగా 9వ రోజు విజయగణపతిని కరెన్సీ నోట్లతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తామని పాఠశాల కరస్పాండెంట్ బీఆర్‌కే రాజు తెలిపారు.

- పట్టాభిరెడ్డి తోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో నిర్వాహకుడు రొబ్బి శ్రీనివాసు ఆధ్వర్యంలో వినాయకుడిని ప్రతిష్ఠించి వినాయక వ్రతం చేశారు. వినాయకుడికి ప్రత్యేకంగా ఉండ్రాలు, ప్రసాదాలు సమర్పించుకున్నారు. ఆశ్రయం పొందుతున్న వృద్ధులు పాల్గొని పూజలు చేసి విఘ్నేశ్వరుడి ఆశీస్సులు పొందారు.
- బిర్లా కూడలి సమీపంలోని జనరేషన్ యువ ఆశ్రమంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పురస్కార్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షురాలు కీర్తి పట్నాయక్ పాల్గొని విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఆశ్రయం పొందుతున్న బాలికలకు చెవి దిద్దులు అందించారు.



గణపతిని దర్శించుకున్న రెయ్యి వెంకటరమణ



వినాయక విగ్రహం వద్ద శ్రీహర్షనగర్ యూత్ అసోసియేషన్ సభ్యులు



ఆక్సిజన్ టవర్స్‌లో ఏర్పాటు చేసిన గణపతి

కాట్రగడ్డ భారతికి సురా పురస్కారం

సీతంపేట : ప్రముఖ సంఘ సేవకుడు, హేతువాది పేరిచర్ల సుబ్బరాజు పేరిట నెలకొల్పిన సురా సాహిత్య సామాజిక సేవా పురస్కారాల ప్రధానం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. సావిత్రీ భాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురికి పురస్కారాలు అందజేశారు. సురా సాహిత్య సామాజిక సేవా పురస్కారం 2024 సంవత్సరానికి తెలంగాణ రాష్ట్ర శరీర అవయవ దాతల సంఘం అధ్యక్షురాలు కాట్రగడ్డ భారతికి స్టీల్‌ప్లాంట్ సీవీవో ఎస్.కరుణరాజు చేతుల మీదుగా అందజేశారు. అలాగే చరిత్రకారుడు సయ్యద్ నజీర్ అహ్మద్‌కు(2019), ప్రజా వాగ్గేయకారుడు డప్పు రమేష్‌కు(2020), ప్రముఖ సాహిత్య సామాజిక వేత్త అనిశెట్టి రజితకు(2021), ప్రముఖ సంఘ సేవకురాలు పి.రాజ్యలక్ష్మికి(2022), ప్రముఖ రక్తదాన ఉద్యమకారుడు వి.వినోద్‌బాలుకు



భారతికి పురస్కారం ప్రధానం చేస్తున్న కరుణరాజు, తదితరులు

(2023) పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా గూడూరు సీతామహాలక్ష్మి మాట్లాడుతూ కుల, మత, సామాజిక రుగ్మతలకు, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాడిన మానవతావాది పేరిచర్ల సుబ్బరాజు అని కొనియాడారు. వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న వారిని అతని పేరిట పురస్కారంతో కుటుంబ సభ్యులు సత్కరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్.బాబూరావు పాల్గొన్నారు.

వర్షం వేళ.. అప్రమత్తతే రక్ష

తాటిచెట్లపాలెం : వాయుగుండం ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున విద్యుత్ స్తంభాలు, ఉపకరణాలతో జాగ్రత్తగా ఉండాలని విద్యుత్ శాఖ సిబ్బంది సూచిస్తున్నారు. జాగ్రత్తలు తీసుకుని ఏపీ ఈపీడీసీఎల్ సిబ్బందికి సహకరించాలని కోరుతున్నారు.

- వర్షాల సమయంలో ఇంటి గృహోపకరణాలు స్విచ్ ఆఫ్ మోడ్‌లో ఉంచుకోవాలి.
- స్విచ్‌బోర్డులు, స్విచ్‌లను తడి చేతులతో తాకరాదు.
- చిన్నపిల్లలను కరెంట్ వస్తువులను తాకనీయరాదు.
- ఇంటి సర్వీసు వైరు తెగినా, వైర్లు జాయింట్స్ కట్ అయినా వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి తెలియజేయాలి.
- వర్షం పడుతున్నపుడు విద్యుత్ స్తంభాలను తాకరాదు.
- ఇంటి పరిసరాల్లో చెట్లు, కరెంటు స్తంభాలు పడినా, వాలినా, కరెంటు వైర్లు తెగినా వెంటనే విద్యుత్ శాఖ కార్యాలయానికి తెలియజేయాలి.
- గాలివాన సమయంలో కరెంటు లైన్ కింద నిల్చోవడం, కూర్చోవడం చేయరాదు
- మోటార్ల స్టార్టర్లు, మోటార్లు వర్షం నీటిలో మునగడం, పూర్తిగా తడవడం వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉంది.
- విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1912కు కాల్ చేయాలి.

విద్యుత్ దీపాలు వెలగక అవస్థలు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో విద్యుత్ దీపాలు వెలగడం లేదు. గత వారం రోజులుగా ఈ ప్రాంతంలో అంధకారం నెలకొనడంతో వాహనదారులు, స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి వేళ విష పురుగులు రోడ్డుపైకి వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. వెంటనే విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

బాలయ్య శాస్త్రి లే అవుట్ ప్రాంతంలో వెలగని వీధి లైటు →



తెరిపివ్వని వర్షంతో అవస్థలు

- రెండు రోజులుగా ఇళ్లకే పరిమితమైన జనం
- కొనేవారు లేక సాగని వ్యాపారాలు



అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లో కురుస్తున్న వాన



ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ పక్క రోడ్డులో విరిగిన చెట్టు కొమ్మ

సీతంపేట : వాయుగుండం ప్రభావంతో రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షంతో నగరం తడిసి ముద్దైపోయింది. శనివారం మొదలైన వర్షం ఆదివారం కూడా ఎడతెరిపి లేకుండా కురిసింది. కుండపోత వాన కారణంగా జనం చాలా వరకు ఇంటికే పరిమితమయ్యారు. కాలు బయటపెట్టే వీలు లేకుండా రోజంతా వాన కురవడంతో జనం అవస్థల పాలయ్యారు. భారీ వర్షం కారణంగా వినాయక చవితి రోజున జనం బయటకు వచ్చే వీలుకుండా పోయింది. ఆదివారం బజార్‌కు వెళ్లే అవకాశం లేక ఇంటికే పరిమితమయ్యారు. వ్యాపారులు, అత్యవసర పనులపై బయటకు వచ్చిన వారు గొడుగులు, రెయిన్‌కోట్లు ధరించి పనులు చక్కబెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారీ వర్షం కారణంగా వ్యాపారాలు సాగక చిరువ్యాపారులు, తోపుడుబళ్ల వ్యాపారులు ఉసూరుమన్నారు. ముసురుతో బేరాలు లేక రోజు కూలీ కూడా కిట్టలేదని, పైగా తెచ్చిన సరుకు పాడైపోతోందని తోపుడుబళ్ల వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం కారణంగా కొన్ని చిరు వ్యాపారాలు తెరుచుకోలేదు. నరసింహనగర్ రైతుబజార్‌లో కొనేవారు లేక వెలవెలబోయింది. ఏకదాటిగా కురిసిన వర్షానికి అక్కయ్యపాలెం, శంకరమఠం ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి.



అక్కయ్యపాలెంలో మూతపడిన చిరు వ్యాపారాలు

రోడ్లు జలమయం... చిరువ్యాపారులు వెలవెల

సీతమ్మధార : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పలు ప్రాంతాల్లో రోడ్ల మీదనే నీరు నిలిచిపోయింది. జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని చిరు వ్యాపారులు వర్షం కారణంగా నూడిల్స్ బళ్లు తెరవడం లేదు. సీతమ్మధార రైతుబజారులో వ్యాపారాలు లేక వినియోగదారుల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. నక్కవానిపాలెం క్రాంతినగర్, గాంధీనగర్, రేసపువానిపాలెం, సత్యం జంక్షన్, టీపీటీ కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. 14వ వార్డులోని బాలయ్య శాస్త్రి లే అవుట్, నార్త్ ఎక్స్‌టెన్సన్, గణేష్‌నగర్, సీతమ్మధార కొండ ప్రాంతంలో ఉన్న ఏఎస్ఆర్ నగర్, బిలాల్ కాలనీ వాసులు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. పీ అండ్ టీ కాలనీ, టీపీటీ కాలనీ, రాధాకృష్ణ లే అవుట్ ప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పలు నివాసాల ముందు కాలువల మీద గట్లు కారణంగా వర్షపు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. విద్యుత్ వైర్ల మీద చెట్ల కొమ్మలు పడడంతో సరఫరాకు అంతరాయం కలిగింది. కొన్ని ప్రాంతాల్లో రోడ్ల మీద వున్న గోతులు వర్షాలకు కనిపించక వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. ఫుట్‌పాత్‌లు, రోడ్ల మీద వ్యాపారాలు చేసుకునే వారు దుకాణాలు ఏర్పాటు చేయలేని పరిస్థితి నెలకొంది.



సేవా రహదారిపై నిలిచిపోయిన వర్షం నీరు



వర్షాలతో కొనుగోలుదారులు లేక బోసిపోయిన సీతమ్మధార రైతుబజారు

మురళీనగర్ : బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో ముసురు పట్టింది. కనీసం నిమిషమైనా తెరిపివ్వక పోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. మార్కెట్లు వెలవెలబోయాయి. నిత్యావసర సరకులు తెచ్చుకోవడానికి బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఆదివారం కావడంతో ఉద్యోగులు, విద్యార్థులు ఇంటి వద్దనే ఉన్నారు. వర్షానికి జాతీయ రహదారితోపాటు సేవా రహదారుల్లో నీరు నిలిచిపోవడంతో వాహన చోదకులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

ఘనంగా గ్రేస్ బాప్టిస్ట్ టెంపుల్ ఫౌండర్స్ డే



మాట్లాడుతున్న గ్రేస్ బాప్టిస్ట్ టెంపుల్ చర్చి పాస్టర్ గరికిముక్కుల పాల్ విక్టర్

తాటిచెట్లపాలెం : తాటిచెట్లపాలెం, కైలాసపురం ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన గ్రేస్ బాప్టిస్ట్ టెంపుల్ ఫౌండర్స్ డే వేడుకలు గ్రేస్ బాప్టిస్ట్ టెంపుల్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఫౌండర్ గరికిముక్కుల సరోజిని రాబర్ట్స్ 89వ జయంతిని నిర్వహించారు. గరికిముక్కుల పాల్ విక్టర్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో యనమల ఐజక్ దైవసందేశం అందించారు. చర్చి పాస్టర్ పాల్ విక్టర్ మాట్లాడుతూ 55 ఏళ్ల క్రితం ఈ పరిచర్యలు ప్రారంభించి, పరిసర ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. పేద మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి, ఉచితంగా మిషన్లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బిషప్‌లు పద్మకుమార్, జార్జ్‌బాబు, జాన్‌మేరీ, పాల్, రవిబాబు, జాన్ విక్టర్ పాల్గొన్నారు.

ముగిసిన పోషకాహార వారోత్సవాలు

మహారాణిపేట : వారం రోజుల నుంచి జరుగుతున్న పోషకాహార వారోత్సవాలు శనివారం కేజీహెచ్ పిల్లల వైద్య విభాగం ఆధ్వర్యంలో విజయవంతంగా ముగిశాయి. దేశంలోని గర్భిణులు, తల్లులు, పిల్లలకు పోషకాహారం అందించడం, సమగ్ర ఆరోగ్యం కోసం పోషకాహారంపై అవగాహన పెంపొందించడం, శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పిల్లల వైద్య విభాగ డాక్టర్ చక్రవర్తి తెలిపారు. ఈ సందర్భంగా గర్భిణులు, తల్లులు, పిల్లలకు పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అలాగే పలు పాఠశాలల్లో కూడా పోషకాహారం విలువలు, వండే విధానంపై తెలియజేశారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, వైద్యులు డాక్టర్ సత్యకుమారి, డాక్టర్ హేమారెడ్డి, డాక్టర్ ప్రభు పాల్గొన్నారు.